AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
27-4-2026 (Monday)
MAIN EDITION

హైదరాబాద్‌లో ముదురుతున్న ఎండలు..

అక్షరటుడే, హైదరాబాద్: నగరంలో ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఉక్కపోతతో కూడిన వేడి నగరవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రస్తుతం నగరంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. ఉదయం 11:50 గంటల సమయానికే ఉష్ణోగ్రత 39.0C గా నమోదైంది. గాలిలో తేమ వల్ల ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి, 42.0C ఉన్నట్లుగా అనిపించవచ్చు. నిన్నటితో పోలిస్తే ఉష్ణోగ్రత 3.3C మేర పెరగడం గమనార్హం. ప్రస్తుతం నగరంలో తీవ్రమైన హీట్‌వేవ్ నడుస్తోంది.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మరోసారి బాంబు బెదిరింపు

అక్షరటుడే, హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టు టెర్మినల్‌కు మరోసారి బాంబు బెదిరింపు వచ్చింది. లగేజీ బ్యాగ్‌లో బాంబు పెట్టామని మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగులను క్షణంగా తనిఖీ చేశారు. అయితే వారికి ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించలేదు.

మూడు రోజుల నష్టాలకు బ్రేక్

అక్షరటుడే, బిజినెస్ డెస్క్: దేశీయ స్టాక్ మార్కెట్ మూడు సెషన్ల తర్వాత లాభాల బాట పట్టింది. అమెరికా, ఇరాన్‌ల మధ్య శాంతి చర్చల విషయంలో ముందడుగు పడవచ్చన్న అంచనాలతో స్టాక్ మార్కెట్ కోలుకుంది. చివరికి సెన్సెక్స్ 639 పాయింట్ల లాభంతో 77,303 వద్ద, నిఫ్టీ 194 పాయింట్ల లాభంతో 24,092 వద్ద స్థిరపడ్డాయి.

లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు..

అక్షరటుడే, నేషనల్ డెస్క్: కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు ఏర్పడనున్నాయి. ఈ మేరకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రకటన చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించి కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌కు ఆమోదం తెలిపినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఇదొక చరిత్రాత్మక రోజు అని అన్నారు.

పాకిస్థాన్ సరైన మధ్యవర్తి కాదు..

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: అమెరికా - ఇరాన్ మలివిడత చర్చలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ పార్లమెంట్‌లో ఆ దేశ ఎంపీ, జాతీయ భద్రత విదేశాంగ విధాన కమిషన్ అధికార ప్రతినిధి అయిన ఇబ్రహీం రెజాయీ మాట్లాడుతూ.. పాక్ సరైన మధ్యవర్తి కాదనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.

ప్రగతి రథాన్ని పరిగెత్తించేది బీఆర్ఎస్సే..

అక్షరటుడే, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ జాతి ఆత్మగౌరవం కోసం ఎగిసిన జెండా ఈ రోజుతో 25 వసంతాల మైలురాయిని చేరుకుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అనేది కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అది ఒక అలుపెరుగని విప్లవమని కొనియాడారు. పాతికేళ్ల ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని ఒక మహోజ్వల "లాంగ్ మార్చ్"గా అభివర్ణిస్తూ, స్వీయ రాజకీయ అస్తిత్వ పతాకం రెపరెపలాడుతోందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అభివృద్ధి కుంటుపడిందని, సంక్షేమం అడుగంటిందని మండిపడ్డారు. అరాచక పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రగతి రథం మళ్లీ పరుగులు తీసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, గులాబీ జెండా మళ్లీ సగర్వంగా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ శవంతో సమానమన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ పార్టీ పెట్టారని, ఆ పర్పస్ సాల్వ్ అయిందన్నారు. శవానికి ఎంత అలంకరణ చేసినా తిరిగి ప్రాణం రాదని, బీఆర్ఎస్ పరిస్థితి కూడా సరిగ్గా అలాగే ఉందన్నారు. ఆ పార్టీకి ఘన చరిత్ర ఉండొచ్చు కానీ, భవిష్యత్తు మాత్రం లేదన్నారు. –అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

బీఆర్ఎస్ పని అయిపోయింది

■ ఆ పార్టీకి భవిష్యత్ లేదు ■ మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

అసెంబ్లీ ఆవరణలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. రాజకీయాల్లో ప్రతి పనికి ఒక ఉద్దేశం ఉంటుందన్నారు. అది నెరవేరిన తర్వాత దానికి ప్రాముఖ్యత ఉండదని చెప్పారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ మనుగడ దాదాపు ముగిసిందని వ్యాఖ్యానించారు.

కవిత పార్టీపై..

కల్వకుంట్ల కవిత ఇటీవల తెలంగాణ రాష్ట్ర సేన పేరుతో పార్టీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సీఎం స్పందించారు. కొత్త పార్టీ గురించి మనకు ఎందుకన్నారు. ఉన్న పార్టీ ఉంటుందా. ఉండదో చూడండని సెటైర్ వేశారు. కేసీఆర్ తనకు ప్రత్యర్థి మాత్రమేనని, శత్రువు కాదన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరారు. వారసత్వ రాజకీయాల కోసమే కొందరు ఆయన చెడు కోరుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

అహంకారంతో..

పదేళ్ల అధికారంలో బీఆర్ఎస్ నాయకులకు అహంకారం, గర్వం వచ్చాయని రేవంత్‌రెడ్డి విమర్శించారు. దీంతో ప్రజలు 2023 ఎన్నికల్లో ఓడించారన్నారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఇవ్వకుండా బుద్ధి చెప్పారన్నారు. కేసీఆర్ కుటుంబంతో తెలంగాణ ప్రజలకు ఉన్న బంధం పూర్తిగా తెగిపోయిందని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ కుటుంబం తమ ఉనికిని కాపాడుకోవడానికి తాపత్రయ పడుతోందని విమర్శించారు.

సీబీఐ డైరెక్టర్‌ను కలుస్తాం

కాళేశ్వరం విషయంలో కోర్టు తీర్పుపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కమిషన్ నియామకం ఏక పక్షమని ఎక్కడా కోర్టు చెప్పలేదన్నారు. కమిషన్ నియామకం చట్టబద్ధమేనని.. జీవో కొట్టేయడం కుదరదని కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. అయినా బీఆర్ఎస్ నాయకులు తాము గెలిచినట్లు సంబరాలు చేసుకుంటున్నారని విమర్శించారు. సెక్షన్ 8బీ, 8సీ ప్రకారం.. ప్రస్తుతం చర్యలు వద్దని మాత్రమే కోర్టు చెప్పిందని తెలిపారు. కమిషన్ నివేదిక యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఢిల్లీ వెళ్లి సీబీఐ డైరెక్టర్‌ను కలుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచుతామని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని సీఎం అన్నారు. బీజేపీని ప్రసన్నం చేసుకోవడానికే ఇటీవల హరీశ్‌రావు ఢిల్లీ వెళ్లారన్నారు.

రాష్ట్రంలో రెండు కూటములు

తెలంగాణ రాష్ట్రంలో రెండు కూటములు ఉంటాయని సీఎం పేర్కొన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్ట్, కోదండరాం ఒక కూటమి అని, బీఆర్ఎస్, బీజేపీ మరో కూటమి అన్నారు.

బెంగాల్‌లో కమలం వికసిస్తుంది: మోదీ

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: పశ్చిమ బెంగాల్‌లో రెండో దశ ఎన్నికలు ఈ నెల 29న జరగనున్నాయి. నేటితో ప్రచారానికి తెర పడనుంది. ఈ క్రమంలో ప్రధాని మోదీ చివరి రోజు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. టీఎంసీ పాలనపై విమర్శలు చేసిన ఆయన.. బెంగాల్‌లో కమలం వికసిస్తుందన్నారు. జనసంఘ్‌కు బెంగాల్ పుట్టినిల్లు అన్నారు. మమతకు 15 ఏళ్లు అవకాశం ఇచ్చారని, మహిళల భద్రత కోసం దీదీ సర్కార్ ఏం చేయలేదన్నారు. రైతులు, యువత కోసం చేసిందేమీ లేదని విమర్శించారు. బూతులు తిట్టడం, అబద్ధాలు చెప్పడమే టీఎంసీ విధానం అని విరుచుకుపడ్డారు. బీహార్, ఒడిశాలో కమలం వికసించిందని, ఇప్పుడు బెంగాల్ వంతు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం బ్యారక్‌పూర్‌లో జరిగిన విజయ సంకల్ప సభలో ప్రసంగించారు. రాష్ట్రంతో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావించారు. మే 4న ఫలితాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణం

అక్షరటుడే, హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎంపికైన ప్రొఫెసర్ కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. శాసనమండలి ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో పదవీ ప్రమాణం చేయించారు. ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హాజరయ్యారు. ఆయనతో పాటు రాష్ట్ర మంత్రివర్గంలోని పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ కోటా కింద వీరిద్దరినీ ఎమ్మెల్సీలుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిన్ననే (ఆదివారం) అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ఈ నియామకాలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన కొద్ది గంటల్లోనే ప్రమాణస్వీకార కార్యక్రమం జరగడం విశేషం.

అమెరికాకు ఇరాన్ వార్నింగ్

అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికా - ఇరాన్ మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్నా.. మాటల యుద్ధం మాత్రం కొనసాగుతోంది. ఇరు దేశాల నేతలు మాటల తూటాలు పేలుస్తుండడంతో ప్రపంచం ఆందోళన చెందుతోంది. ఇరాన్, అమెరికా మధ్య సీజ్‌ఫైర్ కుదిరిన విషయం తెలిసిందే. మొదట రెండు వారాలకు ఒప్పందం జరగ్గా.. తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దానిని పొడిగించారు. ఇటీవల ట్రంప్ మాట్లాడుతూ.. మూడు రోజుల్లో ఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్ చమురు పైప్‌లైన్లను పేల్చేస్తానని హెచ్చరించారు. దీనిపై ఇరాన్ ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ సగ్‌హబ్ ఇస్ఫహానీ తీవ్రంగా స్పందించారు. చమురు క్షేత్రాలు సహా తమ మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు చేస్తే పరిణామలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అమెరికాకు మద్దతిచ్చే దేశాల్లో దానికి నాలుగు రెట్ల విధ్వంసానికి పాల్పడతామన్నారు.

హైకోర్టు జడ్జికి అరవింద్ కేజ్రీవాల్ లేఖ

అక్షరటుడే, ఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు విచారణకు కోర్టుకు వ్యక్తిగతంగా, న్యాయవాది ద్వారా హాజరుకావడానికి నిరాకరిస్తూ ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సోమవారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి స్వర్ణ కాంత శర్మకు లేఖ రాశారు. హైకోర్టు న్యాయమూర్తి నుంచి తనకు న్యాయం జరుగుతుందనే ఆశ పోయిందన్నారు. మహాత్మా గాంధీ మార్గాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నట్లు కేజ్రీవాల్ లేఖలో పేర్కొన్నారు. అవసరం అయితే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆయన తెలిపారు. జస్టిస్ స్వర్ణ కాంత నిర్ణయాన్ని అప్పీల్ చేయడానికి సుప్రీంకోర్టును ఆశ్రయించే హక్కు తనకు ఉందన్నారు.

రాశీ ఖన్నా షాకింగ్ లుక్.. షూలో గన్..

టాలీవుడ్ బ్యూటీ రాశీ ఖన్నా మరోసారి డిజిటల్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేయడానికి రెడీ అయ్యింది. ఈ అమ్మడు నటిస్తున్న సరికొత్త మ్యూజికల్ యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ 'లుక్కే' మే 8 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. చండీగఢ్ రాప్ కల్చర్ నేపథ్యంలో సాగే ఈ సిరీస్‌లో రాశీ ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తోంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన 'గన్ విత్ షూ' ఫోటో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ప్రమోషన్స్‌లో భాగంగా రాశీ ఖన్నా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక ఫొటో వైరల్‌గా మారింది. తన షూలో గన్‌ను దాచి ఉంచిన ఒక పిక్‌ను షేర్ చేస్తూ.. "పైన ప్రశాంతంగా కనిపిస్తూ లోపల ఏదో భారమైన విషయాన్ని మోసే పాత్రలంటే నాకు ఇష్టం" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. –అక్షరటుడే, సినిమాడెస్క్

తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ కొరత

అక్షరటుడే, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ పెట్రోల్, డీజిల్ కొరత నెలకొంది. ఇంధనం దొరకదనే వార్తలు, కొరత ఉందని ప్రచారం జరగడంతో ప్రజలు భయాందోళనకు గురై అధిక మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్రోల్ బంక్‌ల్లో నిల్వలు అయిపోయి నో స్టాక్ బోర్డులు దర్శనం ఇస్తున్నాయి. వాహనదారులు పెట్రోల్ బంక్‌లకు బారులు తీరడంతో .. ఏపీ, తెలంగాణలో పలు చోట్ల బంక్‌ల్లో స్టాక్ అయిపోయింది. దీంతో నోస్టాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా చాలా బంకుల్లో డీజిల్ కొరతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణలో ఇంధన కొరత లేదని అధికారులు స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సమృద్ధిగానే ఉన్నాయని వెల్లడించారు. వినియోగదారులు ఎలాంటి అపోహలకు గురి కావొద్దని కోరారు.

అషురెడ్డి వివాదం.. తండ్రి సంచలన వ్యాఖ్యలు

అక్షరటుడే, హైదరాబాద్: నటి, బిగ్‌బాస్ ఫేమ్ అషురెడ్డిపై ఎన్ఆర్ఐ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను పెళ్లి పేరుతో మోసం చేశారన్న ఆరోపణలు ఇటీవలి కాలంలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వివాదంపై అషురెడ్డి ఇప్పటికే స్పందించగా, తాజాగా ఆమె తండ్రి వెంకటకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడి పలు కీలక విషయాలను వెల్లడించారు. వెంకటకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, 2021లో ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ నుంచి తమకు సంబంధం విషయమై ఫోన్ వచ్చిందని చెప్పారు. ఫోన్‌లో మాట్లాడటానికి బదులుగా నేరుగా ఇంటికి వచ్చి మాట్లాడాలని చెప్పగా, సత్యనారాయణ తన బంధువుతో కలిసి వచ్చి కుటుంబ వివరాలు వెల్లడించారని తెలిపారు. ఆ సమయంలో తమవైపు నుంచి కొంత సమయం తీసుకుని నిర్ణయం చెబుతామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఆ కుటుంబంపై తనకు తెలిసిన పరిచయాల ద్వారా విచారణ చేయించగా కొన్ని అనుమానాస్పద విషయాలు తెలిసినట్లు ఆయన వెల్లడించారు.